సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



వీరులారా.. వందనం!

కడపలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వారి త్యాగాలు, సేవలు స్మరించనున్నారు. - 8లో



డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఆరు జిల్లాల నుంచి వచ్చిన జట్లు పోటీలో పాల్గొంటున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
33.2/24.6

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.6 – 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సోమవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో ప్రయాణికులు మొబైల్ నంబరు : 9959225848కు గానీ, అదే నంబరుకు వాట్సాప్ ద్వారా గానీ తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: వాయుగుండం తీరం దాటినా జిల్లాలో వర్షాలు అప్పుడప్పుడు కురుస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా పోరుమామిళ్లలో 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బి.కోడూరులో 15.2 మి.మీ, కలసపాడు 6.4, గోపవరం, రాజుపాళెం 6.2, దువ్వూరు 4.8, వల్లూరు 4.6, ప్రొద్దుటూరు, కడప 4.4, బద్వేలు 4, చాపాడు 3.8, చెన్నూరు 3.6, ఒంటిమిట్ట 3.4, చక్రాయపేట 3, బి.మఠం, వీఎన్ పల్లి 2.8, కమలాపురం, సిద్దవటం 2.6, వేముల 1.6, వేంపల్లి, పులివెందుల, మైలవరం 1.4, కొండాపురం, ఎర్రగుంట్ల, తొండూరులో 1.2 మి.మీ వర్షం కురిసింది.

21 నుంచి డిగ్రీ ఒకేషనల్ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ కళాశాలలో నాలుగేళ్ల యూజీ ఆనర్స్ ఒకేషనల్ రెండవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఎంఎల్‌టీ, డెయిరీ సైన్స్ చదివే విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ప్రతి రోజు (27వ తేదీ మినహా) ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను చదువుతున్న కళాశాల నుంచి పొందాలన్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు.


పుష్పగిరిలో హైకోర్టు జడ్జి



శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ బి. క్రిష్ణమోహన్

వల్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ బి.క్రిష్ణమోహన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తరువాత పుష్పగిరి మఠాన్ని సందర్శించారు. మఠం నిర్వాహకులు ఆయనను సన్మానించారు.

సమిధలవుతున్న వనితలు



- కూటమి ప్రభుత్వంలో భద్రత కరువు
- తరచూ చోటుచేసుకుంటున్న దాడులు, హత్యలు
- దిశ యాప్ కనుమరుగు.. రెచ్చిపోతున్న పోకిరీలు
- దస్తగిరమ్మ మృతిపై రగిలిపోతున్న మహిళా లోకం

సాక్షి ప్రతినిధి, కడప: ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. క్రమం తప్పకుండా హత్యలు, అత్యాచారాలు తెరపైకి వస్తున్నాయి. ఇటీవల నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారం, ఆపై హత్య ఉదంతం మరువకమునుపే, మొన్న పుంగనూరులో ముస్లిం కుటుంబానికి చెందిన మరో బాలికను హత్య చేసి చెరువులో పడేశారు. నిన్న మదనపల్లెలో స్వర్ణకుమారి అనే మహిళ హత్యోదంతం తెరపైకి వచ్చింది. తాజాగా బద్వేలులో ప్రేమ పేరుతో విద్యార్థిని దస్తగిరమ్మ భయానక హత్య వెలుగు చూసింది. కూటమి ప్రభుత్వం వచ్చింది మొదలు మహిళలు సమిధలైపోతున్నారు.

- రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మహిళలకు భద్రత కరువైంది. చంద్రబాబు సర్కారులో 71 మందిపై అత్యాచారాలు, లైంగిక దాడులు తెరపైకి వచ్చాయి. వారిలో ఆరుగురిపై అత్యాచారం చేసి హత్య చేశారు. దాదాపు 200 మంది మహిళలు వేధింపులకు గురయ్యారు. వేధింపులు తట్టుకోలేక నలుగురు ఆత్మహత్యలు చేసుకున్నట్లు క్రైమ్ రికార్డు వెల్లడిస్తోంది. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో మైనర్ బాలిక అత్యాచారం, హత్య, పుంగనూరులో ముస్లిం బాలిక హత్య, పీఠాపురంలో యువతిపై అత్యాచారం, హిందూపురంలో అత్త, కోడళ్లపై సామూహిక అత్యాచారం ఇలా వరుస ఘటనలు తెరపైకి వస్తున్నా.. ప్రభుత్వంలో సత్వర చలనం లోపించడంతో క్రమం తప్పకుండా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రత్యేక చొరవ లేకపోవడంతోనే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బాలికలు, మహిళలకు ప్రత్యేక భద్రత ఉండేది. దిశ యాప్ మొబైల్ ఫోన్‌లో ఉంటే అదో భద్రతగా నిలిచేది. ఎస్‌ఓఎస్ బటన్ నొక్కినా, మొబైల్ ఫోన్ అటు ఇటు 5 సార్లు కదిలించినా వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉండే పోలీసులకు సమాచారం వెళ్లేది. ఐదు నిమిషాల్లో పోలీసులు వచ్చి భద్రత కల్పించేవారు. దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంగా నిలిచేది. శాంతి భద్రతల పర్యవేక్షణ, స్వీయ రక్షణ కోసం దిశా యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. మరోవైపు దిశ చట్టం కారణంగా సత్వర న్యాయం లభించేది. అలాంటి చట్టాన్ని, యాప్‌ను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేసిందని మహిళలు వాపోతున్నారు. రెడ్ బుక్ పాలనంటూ కక్ష సాధింపు చర్యలు మినహా ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడంలో చంద్రబాబు సర్కారు విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు.



దస్తగిరమ్మ మృతిపై రిమ్స్ మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న దూదేకుల సంఘం నాయకులు



విలపిస్తున్న మృతురాలు దస్తగిరమ్మ తల్లిని ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు

ఆటవిక రాజ్యం

రెడ్ బుక్ పాలనలో రాష్ట్రంలో ఆటవిక రాజ్యం కొనసాగుతోందని మహిళా లోకం ఆరోపిస్తోంది. మహిళలపై సామూహిక అత్యాచారాలు, చిన్నారుల హత్యోదంతాలు అందుకు నిదర్శనంగా చెప్పుకొస్తున్నారు. దిశ యాప్ కొనసాగి ఉంటే.. బద్వేలు విద్యార్థిని దస్తగిరమ్మకు రక్షణ లభించేదని పలువురు పేర్కొంటున్నారు. మద్యం వ్యాపారంపై ఉన్న ప్రత్యేక శ్రద్ధ.. యువతులు, మహిళల మాన ప్రాణాలకు రక్షణ కల్పించడంలో చూపించడం లేదని పలువురు మండిపడుతున్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ చదువుతున్న దస్తగిరమ్మకు నిప్పంటించి చంపేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన విగ్నేష్ ఒక ప్రేమోన్మాదన్నారు. బద్వేలుకు చెందిన దస్తగిరమ్మ అనే మైనర్ బాలికను బద్వేల్ సమీపంలో ఉన్న సెంచరీ ప్లైవుడ్ ఎదురుగా ఉన్న అడవిలోకి తీసుకెళ్లి నిప్పటించాడన్నారు. ఆమె తేరుకుని కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వెళ్లి సరికి ఉన్మాది పారిపోయాడన్నారు. దస్తగిరమ్మ మృతి ఘటన చాలా బాధాకరమని, ఇటువంటి సంఘటన ఎవరికీ జరగకూడదన్నారు.

చదువుల తల్లిని చిదిమేసిన ప్రేమోన్మాదం

- విద్యార్థిని హత్యోదంతంపై అంతటా దిగ్భ్రాంతి
- రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన



దస్తగిరమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్: ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలకు చేరి తన కుటుంబానికి అండగా నిలవాలనుకున్న ఆ విద్యా కుసుమం అంతలోనే నేలరాలింది. నూరేళ్ల బంగారు భవిష్యత్తు ప్రేమోన్మాదం కారణంగా అర్ధాంతరంగా ముగిసింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దస్తగిరమ్మ హత్యోదంతం అంతటా దిగ్భ్రాంతి కలిగించింది.

చదువులో టాపర్

బద్వేలు పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన హుస్సేనయ్య, హుస్సేనమ్మకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. హుస్సేనయ్య రైస్‌మిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. తన కుమార్తె దస్తగిరమ్మకు చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదివిస్తున్నాడు. దస్తగిరమ్మ పదో తరగతి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివింది. పది ఫలితాల్లో 556 మార్కులు సాధించింది. ప్రస్తుతం ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూపు తీసుకుంది. ఆమె చదువులో ముందుంటుందని కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు చెబుతున్నారు. చదువుపై ఆసక్తి ఉన్న దస్తగిరమ్మ అర్ధాంతరంగా ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురికావడంతో తోటి విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఆవిరైన ఆశలు

అటు నివసిస్తున్న వీధిలో, ఇటు కళాశాలలో అందరితో స్నేహపూర్వకంగా మెలిగే దస్తగిరమ్మ ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురికావడాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా కష్టపడి చదివి మంచి ఉన్నత స్థితికి చేరుకుని తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోవాలని బంధువులకు, స్నేహితులకు చెబుతుండే దస్తగిరమ్మ కన్న కలలు, ఆశలు ఆవిరై తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చి వెళ్లిపోవడం బాధాకరమని దస్తగిరమ్మ స్నేహితులు కంటతడి పెట్టారు.

మంచి విద్యార్థిని కోల్పోయాం



దస్తగిరమ్మ ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా ప్రతి రోజూ కళాశాలకు వచ్చేది. చదువులో కూడా బాగా రాణిస్తుండేది. కళాశాలలో ఏదైనా వర్క్ ఇస్తే అందరి కంటే ముందుగా చేసేది. చేతిరాత కూడా చాలా బాగుంటుంది. ఉత్తమ భవిష్యత్తు ఉన్న దస్తగిరమ్మ ఇలా అర్ధాంతరంగా దూరమవడం బాధాకరమైన విషయం. మంచి విద్యార్థిని కోల్పోయాం.
–బి.శివశంకర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకుడు

కలుపుగోలుగా ఉండేది



దస్తగిరమ్మను ముద్దుగా టెడ్డీ అని పిలుచుకునే వాళ్లం. వీధిలో అందరితో కలుపుగోలుగా ఉండేది. కళాశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చదువుకుని ఇంటి పనులు చేసుకుని సరదాగా ఉండేది. ఎవరు ఏ పని చెప్పినా కాదనకుండా చేసేది. అందరితో స్నేహ పూర్వకంగా, గౌరవంగా మెలుగుతూ ఉండే దస్తగిరమ్మ మా మధ్య లేకుండా పోవడం బాధాకరం. దస్తగిరమ్మ మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలి.
–మాబున్నీసా, మృతురాలి మేనత్త

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐ, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు ఐ.యన్.సుబ్బమ్మ, వీరణాల శివకుమార్, వీరపోగు రవి, బి.దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలులో మైనర్ బాలికను చంపిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. దేశం, రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బద్వేలులో జరిగిన సంఘటన సభ్య సమాజం సిగ్గు పడేలా వున్నదన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియోను ప్రభుత్వం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్, రెబ్బ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఆది తుల సిశ్వర్ యాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

రక్షణ లేకుండా పోయింది



కూటమి సర్కారు పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. బద్వేలులో ఇంటర్ విద్యార్థి ఘటనతో రాష్ట్రంలో మహిళల భద్రత అంశం విఫలమైంది. దిశచట్టం ఎందరో మహిళలను కాపాడింది. ఆ చట్టాన్ని కూటమి సర్కారు పక్కన పెట్టడం మహిళలకు శాపంగా మారింది. అతివలకు మేలు జరిగే ఏ చట్టాన్ని అయినా గౌరవించాలి. ఇందులో రాజకీయాలు చూడరాదు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది అనడానికి జరుగుతున్న సంఘటనలే నిదర్శనం.
–రక్కాసి శ్రీవాణిరెడ్డి, మహిళా నేత, రాజంపేట

హోం మంత్రి రాజీనామా చేయాలి



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో ఆడవారి మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. మహిళా హోం మంత్రి ఆధ్వర్యంలో సకల శాఖ మంత్రి లోకేష్ దిశ చట్ట ప్రతులతోపాటు ఆడవారి మాన ప్రాణాలను కాల్చివేసిన మంత్రులు ఉన్న కౌరవ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఎక్కడుంది. బద్వేలులో యువతిని కాల్చి చంపిన మానవ మృగం విఘ్నేష్‌కు సత్వరమే శిక్ష పడుతుందా.. కన్నతల్లి కడుపు కోతకు న్యాయం జరిగేనా?.. నైతిక బాధ్యత వహించి తక్షణమే రాష్ట్ర హోం మంత్రి రాజీనామా చేయాలి.
– జింకా విజయలక్ష్మి, అడ్వకేట్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పద్మశాలి విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు.

అరాచకాలు పెరిగిపోయాయి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజధాని నుంచి మారుమూల పల్లెల వరకు కూటమి నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలు, అత్యాచారాలు దాడులు మితిమీరాయి. గ్రామ సచివాలయ ఉద్యోగులపై దౌర్జన్యం చేస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని పల్లెల్లో అమాయకులపై దాడులకు తెగబడుతున్నారు. అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలను ఆదుకోవాలి. రాష్ట్రంలో మహిళలపై రోజుకొక అత్యాచారం, దాడులు కొనసాగడం దారుణం. ఇదే పరిస్థితి నెలకొంటే శాంతియుతంగా ఉన్న ప్రజల ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం కూలిపోతుంది.
–వడ్డి వెంకట రమణారెడ్డి, సంబేపల్లి

వైవీయూలో నాలుగో కృష్ణుడు తెరపైకి?

- మూడు నెలల్లో ముగ్గురు రిజిస్ట్రార్‌లు
- గాడిన పడని పాలన



వైవీయూ పరిపాలన భవనం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో పాలన ఇంకా పూర్తి స్థాయిలో గాడిలో పడలేదు. వైవీయూ వైస్ చాన్సలర్‌గా పని చేసిన ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య రాజీనామా అనంతరం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య కె.కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అదే సమయంలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆచార్య ఎస్.రఘునాథరెడ్డిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. అనంతరం అక్టోబర్ 1న ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన 5వ తేదీన రాజీనామా చేయడంతో తాత్కాలిక ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అంటూ విశ్వవిద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మను నియమించారు. ఇలా మూడు నెలల కాలంలో ముగ్గురు రిజిస్ట్రార్‌లు ఇన్‌చార్జిలుగా పని చేయడంతో.. పూర్తి స్థాయిలో వారు దృష్టి కేంద్రీకరించలేకపోవడంతో పాలన గాడితప్పింది. చాలా ఫైల్స్ విషయాల్లో పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వకపోవడంతో నాన్చుడు ధోరణితో అధికారులు పాలన సాగిస్తున్నారు. తాజాగా విశ్వవిద్యాలయంలోని ఓ సహ ఆచార్యుడికి రిజిస్ట్రార్ పదవి కట్టబెట్టనున్నట్లు విశ్వవిద్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంతో మంది సీనియర్ ఆచార్యులు ఉండగా, సహ ఆచార్యులకు ఇచ్చేందుకు సన్నద్ధం కావడం పట్ల పలువురు సీనియర్లు పెదవి విరుస్తున్నారు. సదరు సహ ఆచార్యులు మాత్రం నవంబర్ నెలలో సీఏఎస్ (కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం) ద్వారా పదోన్నతులు పూర్తయిన వెంటనే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఇస్తే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. ఈయనతోపాటు మరో ఇద్దరు డీన్‌లు తమ వంతు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. కాగా రెగ్యులర్ వీసీ నియామకం చేపట్టే వరకు కొత్తగా రిజిస్ట్రార్‌లను నియమించవద్దంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు మరోవైపు చర్చ నడుస్తోంది.

11 మందికి రిజిస్ట్రార్‌లుగా అవకాశం

యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం పని చేస్తున్న 11 మంది అధ్యాపకులకు రిజిస్ట్రార్‌లుగా పని చేసిన, చేస్తున్న అనుభవం ఉండటం విశేషం. ఇప్పటికే వివిధ విశ్వవిద్యాలయాలకు రిజిస్ట్రార్‌లను అందిస్తూ వైవీయూ తన ప్రత్యేకత చాటుకుంటోంది. గతంలో పలువురు ఆచార్యులు వివిధ విశ్వవిద్యాలయాలకు రిజిస్ట్రార్‌లుగా పని చేయగా, ప్రస్తుతం మరికొందరు రిజిస్ట్రార్‌లుగా అవకాశం దక్కించుకున్నారు. విశ్వవిద్యాలయంలో ఆచార్య పుత్తా పద్మ (ప్రస్తుత వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్), ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య వై.నజీర్‌అహ్మద్, ఆచార్య డి.విజయరాఘవ ప్రసాద్, ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ఆచార్య బి.శ్రీనివాస్, ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ఎ.అంకన్న, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు (ప్రస్తుతం క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్), డాక్టర్ బి.విజయ్‌కుమార్‌నాయుడు (ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్)లు రిజిస్ట్రార్‌లుగా చేసి ఉండటం విశేషం.

కొలిక్కిరాని హత్యాయత్నం కేసు!

- సీసీ ఫుటేజీల ఆధారంగా కొనసాగుతున్న విచారణ
- అక్కాయపల్లెలో నివాసం ఉండే దీపక్‌గా గుర్తింపు
- అంతర్గత విభేదాలను ఆసరాగా తీసుకున్నారా!
- టీడీపీ నేతల పురమాయింపుతో హత్యాయత్నమా?
- ప్రత్యక్ష పరామర్శ లేకపోవడంతో మరింత బలం చేకూరుస్తున్న వైనం


‘కడప నగరంలో గూండాలం, దాదాలం అనుకునే వారు.. రోడ్ల మీద కుర్చీలు వేసుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మీ అందరికీ చిన్నపాటి విన్నపం, మీరు ఇలాంటి చేష్టలు మానుకొని మీ ఇళ్లలో కుర్చీలు వేసుకొని కూర్చోండి. ఆయా ఏరియాల్లో మీరు దాదాలు, పెద్దపోటుగాళ్లు అనుకుంటున్నారేమో.. వీపులు విమానం మోత మోగుతాయి.’ – ఆ మధ్య కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి ఓ వీడియోలో ఇలా వార్నింగ్ ఇచ్చారు.

- తాజాగా నగర టీడీపీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై హత్యాయత్నం చోటు చేసుకుంది. రెండు రోజులు గడిచి పోయినా వ్యవహారం కొలిక్కి రాలేదు. కుర్చీల్లో రోడ్లపై కూర్చుంటేనే వీపులు విమానం మోత మోగుతాయన్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి వార్నింగ్‌లు.. సాక్షాత్తు టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై హత్యాయత్నం చోటుచేసుకుంటే ఎలాంటి చర్యలు చేపట్టాలి. చర్యలు చేపట్టకపోగా కనీస పరామర్శ లేకపోవడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, కడప: ప్రశాంత వాతావరణానికి కేంద్ర బిందువుగా, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న కడప గడపలో ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి ప్రదేశంలో తరచూ ఉద్రిక్తతలు తెరపైకి వస్తున్నాయి. ఇవన్నీ టీడీపీ నేతల అంతర్గత వ్యవహారమే ప్రధాన కారణమని నగర ప్రజలు చెప్పుకొంటున్నారు.

సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ

శివకొండారెడ్డి హత్యాయత్నం కేసు ఇంకా కొలిక్కి రాలేదు. సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసు విచారణ కొనసాగుతోంది. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిలో అక్కాయపల్లెలో నివాసం ఉండే దీపక్‌గా గుర్తించారు. ‘దీపక్ ఎందుకు దాడి చేశారు. ఎవరి ప్రోత్సాహంతో చేయాల్సి వచ్చింది. వ్యక్తిగత వ్యవహారాలా? వ్యక్తిగత వ్యవహారాలే అయితే ఇంతకు మునుపు ఎప్పుడూ దాడి చేయకుండా ఇప్పుడే ఎందుకు చేయాల్సి వచ్చింది?’ ఇలాంటి ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. వీటన్నింటికీ ఏకైక మూలం టీడీపీ వర్గీయుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలే ప్రధాన కారణమని తెలుస్తోంది. శివకొండారెడ్డి అధిష్టానానికి తెలుగు తమ్ముళ్లపై చేసిన ఫిర్యాదు అసలు మూలంగా పలువురు చెప్పుకొంటున్నారు. హత్యాయత్నం చోటు చేసుకుంటే.. ఓ వైపు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, మాజీ మంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా వెళ్లి పరామర్శించారు. ఇలాంటి సంప్రదాయం కడపలో ఏమాత్రం సహేతుకం కాదని వారు ఖండించారు. రాజకీయాలకతీతంగా సరైన చర్య చేపట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్‌బాబు, పుత్తా నరసింహారెడ్డి సైతం పరామర్శించారు. ఇప్పటికీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రత్యక్షంగా పరామర్శించకపోగా, ఘటనను ఖండించకపోవడం విచారకరమని స్వయంగా టీడీపీ కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. ఇలాంటి తరుణంలో శివకొండారెడ్డి హత్యాయత్నం కేసుకు అసలు మూలం బహిర్గతమయ్యే అవకాశం ఉందా? అనే సందేహాన్ని ప్రజలు వ్యక్త పరుస్తుండటం విశేషం.



గాయపడిన శివకొండారెడ్డి (ఫైల్)

3న ఉర్దూ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కడప ఎడ్యుకేషన్: వైఎస్‌ఆర్ జిల్లా అంజుమన్ తరక్కి ఉర్దూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు కడప, రాయచోటి, ప్రొద్దుటూరు కేంద్రాల్లో ఉర్దూ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సత్తార్ ఫైజి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. ఇందులో 9, 10వ తరగతుల విద్యార్థులకు ‘మౌలానా ఆజాద్.. విద్య’, ఇంటర్ వారికి ‘ఇక్బాల్.. దేశభక్తి’, డిగ్రీ వారికి ‘ఉర్దూ మీడియం మన బాధ్యతలు’, ఎం.ఎ వారికి ‘భారత దేశంలో ఉర్దూ భాష.. నేటి తరం’ అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాలు

- కడపలోని చిలకలబావిలో న్యూక్రిసెంట్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ (కన్వీనర్ అన్వర్ హాది 98851 98194)
- రాయచోటి మార్కెట్ ఉర్దూ హైస్కూల్ (కన్వీనర్ సిబాతుర్రేమాన్ 94416 36630)
- ప్రొద్దుటూరు మౌలానా ఆజాద్ వీధిలోని విజ్డమ్ ఇంగ్లిషు స్కూల్‌లో (కన్వీనర్ ఉర్దూ పండితుడు షాకిరుల్లా 9000030768) నిర్వహిస్తామన్నారు. డిగ్రీ, ఎంఏ ఉర్దూ విద్యార్థులు కడప సెంటర్‌కు మాత్రమే హాజరు కావాలని కోరారు. ప్రతి కేంద్రంలోని అన్ని అంశాలలో విజేతలకు నవంబర్ 9, 10 తేదీలలో బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను ప్రదానం చేస్తారని వారు వివరించారు.

క్లుప్తంగా

చెరువు పరిసరాల్లో చిరుత సంచారం

వేముల : మండలంలోని పెండ్లూరు చెరువు పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం చెరువు సమీపంలో కొంతమంది గొర్రెలను మేపుకుంటుండగా చిరుత కనిపించినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. చిరుతను గమనించిన గొర్రెల కాపరులు కేకలు వేయడంతో పారిపోయిందన్నారు. ఈ సంఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పొలాల వద్దకు వెళ్లే వారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు రాత్రివేళల్లో వెళ్లాలంటే జంకుతున్నారు. చిరుత సంచారం పెర్నపాడు, పెండ్లూరు గ్రామస్తులను భయాందోళనలకు గురి చేస్తోంది.

పాత కక్షలతో పరస్పరం దాడులు

ముద్దనూరు : మండలంలోని సోంపల్లె గ్రామంలో ఆదివారం ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు గ్రామంలో రామకృష్ణారెడ్డి, నాగమునిరెడ్డిల కుటుంబాల మధ్య పాత కక్షలున్నాయి. ఆదివారం అకస్మాత్తుగా ఇరువర్గాల వారు రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో రామకృష్ణారెడ్డి, నాగమునిరెడ్డి, మరో ఇరువురికి రక్త గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా దాడిలో గాయపడిన వారు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి, రాచపల్లి గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న 46 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మంటపంపల్లి గ్రామంలో సుంకేశుల మరాఠీ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద నుంచి 22 మద్యం సీసాలను, రాయపల్లి గ్రామంలో ఓబయ్య అనే వ్యక్తి నుంచి 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

210 లీటర్ల నాటుసారా స్వాధీనం

వాల్మీకిపురం : అక్రమంగా తయారుచేసి తరలిస్తున్న 210 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ మేకలవారిపల్లికి చెందిన గురునాథ, రెడ్డెప్ప, నాగరాజులు కలసి మేకలవారిపల్లి అటవీ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా నాటుసారాను తయారు చేసి, అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి 210 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. గురునాథను పట్టుకోగా, మిగిలిన ఇద్దరు నిందితులు రెడ్డెప్ప, నాగరాజు పరారైనట్లు తెలిపారు. నాటుసారాతో పాటు సారా తయారీ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వీరులారా.. వందనం!

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- జిల్లాలో 21 నుంచి 31 వరకు కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన పోలీసు శాఖ



కడప ఎడ్యుకేషన్ : ఎండ, వాన.. రాత్రి, పగలు అనే తేడా లేకుండా శాంతి భద్రతలను కాపాడటమే వారి లక్ష్యం.. 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు అండగా ఉంటారు. కుటుంబంతో కలిసి జరుపుకునే పండుగలు, ఉత్సవాలను సైతం త్యజించి సమాజ సేవ, ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తారు. అవసరమైతే ప్రాణాలను సైతం అర్పిస్తారు. అలాంటి త్యాగధనులు జిల్లాలో ఉండటం ఎంతో గర్వకారణం. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన త్యాగధనులను మరిచిపోకుండా వారి సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా అక్టోబర్ 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటాం. ఇందుకు సంబంధించి 21వ తేదీ సోమవారం కడప పోలీసు పెరేడ్ మైదానంలో పోలీసు అమర వీరుల సంస్మణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారి త్యాగాలను స్మరిస్తూ వారి సేవలను కొనియాడనున్నారు. జిల్లాలో ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అమర వీరుల స్మారకోత్సవాలను నిర్వహించనున్నారు.

ఈరోజే ఎందుకు జరుపుకుంటున్నాం..

భారత్– చైనా సరిహద్దుల్లో లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్స్ వద్ద 1959 అక్టోబర్ 21న మన దేశ సైన్యం చైనా వారితో పోరాడి సీఆర్‌పీఎఫ్ విభాగానికి చెందిన 10 మంది సైనికులు వీర మరణం పొందారు. వారి ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏడాది పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. 1959 అక్టోబర్ 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దులో విధులు నిర్వర్తిస్తుండగా చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాయి. దీంతో సీఆర్‌పీఎఫ్ దళం హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. ఈ పోరాటంలో 10 మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు. దీంతో ప్రతి ఏటా ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

ఉమేష్‌చంద్ర జ్ఞాపకార్థం..

కడప జిల్లా ఎస్పీగా చదలవాడ ఉమేష్‌చంద్ర 1995 జూన్ 5వ తేదీ నుంచి 1997 ఆగస్టు 8వ తేదీ వరకు పనిచేశారు. ఈయన హైదరాబాదులో అసాంఘిక శక్తుల దుశ్చర్యలకు ప్రాణాలర్పించారు. జిల్లాకు ఆయన అందించిన సేవలకు గుర్తుగా జిల్లాలో ప్రతి పోలీసు స్టేషన్‌లో ఆయన చిత్రపటాన్ని పెట్టుకుని ఆరాదిధిస్తున్నారు. అలాగే ఆయన పేరుపైన కడపలో ఉమేష్ చంద్ర మెమోరియల్ కల్యాణ మండపం నిర్మించారు. ఈ కల్యాణ మండపాన్ని పోలీసు కుటుంబ సభ్యులు, ప్రజలు నిర్వహించుకునే శుభకార్యాలకు వినియోగిస్తున్నారు.

జిల్లాలో అమరవీరులు..

వైఎస్సార్ జిల్లాలోని ఆర్మ్‌డ్ రిజర్వుడు విభాగంలో ఎస్ఐగా పనిచేస్తూ నరసింహులు చక్రాయపేట మండలం రెడ్డిచెరువు అటవీ ప్రాంతంలో మావోయిస్టులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఈయన కర్నూల్ జిల్లా వాసి. ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా పేరొందారు. ఆయన మరణానంతరం అప్పట్లో ప్రతి ఏడాది పోలీసుల మధ్య ఆయన జ్ఞాపకార్థం ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించేవారు.

జిల్లా ఎస్పీ ప్రత్యేక సమావేశం..

విధి నిర్వహణలో వివిధ కారణాలతో మృతి చెందడం బాధాకరం. వారి కుటుంబ సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ ఆదివారం కడప పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో విధినిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్), అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, వారి కుటుంబ స్థితిగతులు, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిబ్బంది సంక్షేమం కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మరణించిన సిబ్బంది కుటుంబాలతో సమన్వయం చేసుకుని వారి సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని జిల్లా పోలీసు అధికారుల సంఘానికి సూచించారు.

జిల్లాలో పది రోజులపాటు..

పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్మారకోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ఓ కార్యక్రమం చొప్పున 10 రోజులపాటు జిల్లా అంతటా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

నేటి నుంచి కార్యక్రమాలు ఇలా..

పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా నిర్వహించే పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు జిల్లాలో 21వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసులను గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల కీలకమైన పాత్ర, విధులు, త్యాగాల గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశంగా ఈ స్మారకోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీన అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని ఉదయం 7.30 గంటలకు కడప నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, తదితర అసాంఘిక శక్తులతో పోరాడటమేగాక విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందికి నివాళులు అర్పించనున్నారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు సెషన్స్ జడ్జి షేక్ ఇంతియాజ్ అహమ్మద్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. అలాగే 21వ తేదీ నుంచి 31 వరకు జిల్లా అంతటా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గల ముఖ్యమైన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో అమర వీరులను స్మరిస్తూ హోర్డింగ్స్, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. 24వ తేదీ పోలీస్ అమర వీరులకు సంబంధించిన విషయాలను సినిమా హాళ్లు, లోకల్ టీవీ ఛానళ్లు, దినపత్రికలలో ప్రచారం చేస్తారు. అలాగే జిల్లాలోని స్కూలు, కళాశాల విద్యార్థులకు 'సైబర్ నేరాల కట్టడిలో యువత పాత్ర' అలాగే పోలీసు సిబ్బంది పిల్లలకు, పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రస్తుత పరిస్థితుల్లో 'పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. 25, 26 తేదీలలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించనున్నారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా పోలీసు సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో కడప నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. 31వ తేదీ రాష్ట్రీయ ఏక్తా దివస్' సందర్భంగా ఉదయం 'సమైక్యతా పరుగు', సాయంత్రం 6 గంటలకు పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వివరించారు.

అమర వీరుల కుటుంబాలకు అండ



అమర వీరులైన వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుంది. వారి కుటుంబాలకు ఎల్లప్పుడు సహాయ, సహకారం అందిస్తుంది. సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ఎవరికి ఆందోళన అవసరం లేదు.

\- వి. హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ, వైఎస్సార్ జిల్లా

అరటి కాయల లారీ బోల్తా

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం అరటి తోటల వద్ద అరటి కాయల లారీ బోల్తా పడింది. గ్రామానికి చెందిన రైతు విశ్వనాథరెడ్డి తోటలో అరటి కాయలు కోసేందుకు లారీ వెళుతుండగా.. ప్రమాదవశాత్తు అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలకు కానీ, డ్రైవర్‌కు కానీ ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతోపాటు రోడ్డంతా గుంతలమయం కావడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడిందని కూలీలు తెలిపారు.



బోల్తాపడిన అరటి కాయల లారీ

రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొని..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు దాటుతున్న మహీధర్ అనే బాలుడిని గుర్తు తెలియని బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడి కాలు విరిగింది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. బాలుడు నీళ్ల కోసం వచ్చి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బైక్ నడిపిన వ్యక్తి పరారైనట్లు స్థానికులు తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన బాలుడు మహీధర్

వ్యాను ఢీకొని..

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని వసుంధర కల్యాణ మండపం వద్ద బైకు టైర్‌కు గాలి పట్టించుకుంటున్న యువకుడిని ఓమ్నీ వ్యాను ఢీ కొట్టడంతో కాలు విరిగినట్లు తెలిసింది. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన దేశాలు (30) బైక్‌పై వస్తూ గాలి పట్టించుకుంటుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కడపకు సిఫార్సు చేశారు.



గాయపడిన యువకుడు దేశాలు

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండోరోజు ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.5 ఓవర్లలో 122 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిశాంత్‌రెడ్డి 21, రుత్విక్ కల్యాణ్ 45 పరుగులు చేశారు. పశ్చిమ గోదావరి బౌలర్లు జితేష్‌సాయివల్లభన్ 2, కార్తీక్ వర్మ 2, పి. నారాయణ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు 57.4 ఓవర్లలో 152 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి. నారాయణ 67 పరుగులు, సూర్యసాయిమణికంఠ 25 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు వివేక్ 4, జగదీష్ 2, వెంకటకార్తీక్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమగోదావరి జట్టు 98 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కర్నూలు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తొలిరోజు వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కాగా, రెండోరోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 51.3 ఓవర్లలో 196 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ప్రణవ్ శ్రీరామ్ 47, ప్రఖ్యాత్‌వర్మ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు రక్షణ్‌సాయి 4, ఆశిష్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 35.2 ఓవర్లలో 35 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సాయిచరణ్ 10 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు ప్రఖ్యాత్‌వర్మ 4, లోహిత్‌రాఘవేంద్ర 3 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్‌డ్రాగా ముగిసింది. విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

తూర్పుగోదావరి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 112 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన తూర్పుగోదావరి జట్టు మరో 11 పరుగులు చేసి 123 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ప్రకాశం బౌలర్ దినేష్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 53.3 ఓవర్లలో 115 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రాజ్‌మోహన్ 55 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి బౌలర్లు కార్తీక్ 4, ఎస్. సైడ్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. జట్టులోని కార్తీక్ 72 పరుగులు చేశాడు. ప్రకాశం బౌలర్ దినేష్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తూర్పుగోదావరి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.



4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ రక్షణ్‌సాయి



4 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ ప్రఖ్యాత్‌వర్మ



72 పరుగులు చేసిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ కార్తీక్



4 వికెట్లు తీసిన ప్రకాశం బౌలర్ దినేష్

చంద్రబాబు వికేంద్రీకరణ ప్రకటనను స్వాగతిస్తున్నాం

- అమరావతి నిర్మాణం పూర్తి కోసమే డ్రామా
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి



వల్లూరు : సీఎం చంద్రబాబు నాయుడు వికేంద్రీకరణ ప్రకటనను తాము స్వాగతిస్తున్నామని, అయితే చంద్రబాబు గత చరిత్ర చూస్తే ఆయన ప్రకటన అంత నమ్మశక్యంగా లేదని, అది ఒక బూటకపు ప్రకటనగా అనిపిస్తోందని, కేవలం అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడానికే వికేంద్రీకరణ నాటకం ఆడుతున్నట్లు అవగతమవుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతాన్ని ఒకసారి పరిశీలిస్తే పెద్ద మనుషుల ఒప్పందం మేరకు రాష్ట్రం విడిపోతే కర్నూలులో రాజధానిని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కానీ 2014 లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్ర విభజన అనంతరం కర్నూలులో ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర రాజధానిని తన స్వార్థ ప్రయోజనాల కోసం అమరావతిలో ఏర్పాటు చేసి అభివృద్ధి, అధికారం మొత్తం అక్కడే కేంద్రీకృతం చేసిన ఘనుడని విమర్శించారు. అనంతపురంలో ఏర్పాటు చేయాల్సిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తీసుకెళ్లాడని వివరించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఆయన వచ్చీ రాగానే కర్నూలులో ఏర్పాటు చేస్తున్న హైకోర్టును అమరావతికి తరలించాడని, లా యూనివర్శిటీని తరలించాడని పేర్కొన్నారు.

వైఎస్ఆర్ జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడ నుండి ఎమ్మెస్‌ఎంఈటను గుంటూరుకు తరలించి తన నైజాన్ని మరోమారు చాటుకున్నాడని విమర్శించారు. ఇలా ఒకే చోట అన్నీ కేంద్రీకృతం చేయడం ఆయనకు అలవాటేనని అన్నారు. ఉమ్మడి ఏపీ లోనూ రాష్ట్రం మొత్తాన్ని ఫణంగా పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తున్నా పట్టించుకోకుండా హైదరాబాదులోనే అభివృద్ధిని కేంద్రీకృతం చేశాడని గుర్తు చేశారు. దీన్ని బట్టి ఆయన గతాన్ని గానీ, ప్రస్తుత పాలనను గానీ పరిశీలిస్తే ఆయన పైకి చెప్పేది ఒకటి లోపల చేసేది ఒకటనే విషయం బోధపడుతుందని అన్నారు. పైకి అన్ని ప్రాంతాలు సమానమని మొసలి కన్నీరు కారుస్తాడనీ, కానీ అన్నీ ఒకే చోట కేంద్రీకృతం చేయడం ఆయనకు అలవాటైన చర్యగా అభివర్ణించారు. గత 5 సంవత్సరాల వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్ చేసింది కూడా అభివృద్ధి, అధికార వికేంద్రీకరణేననీ, అయితే దాన్ని ఏదో ఒక రూపంలో అడ్డుకుంటూ వచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకత రాకుండా అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడానికే వికేంద్రీకరణ పేరుతో నాటకం ఆడుతున్నాడని విమర్శించారు. తన స్వార్థం కోసం తప్పితే ప్రజల కోసమో, రాష్ట్రం కోసమో ఆయన వికేంద్రీకరణ గురించి మాట్లాడటం లేదనే విషయం అందరికీ అర్థమవుతోందన్నారు. కనీసం ఇప్పటికైనా ఆయన అబద్ధాలు ఆడడం మానుకుని చెప్పిన మాట ప్రకారం వికేంద్రీకరణ చేయాలని, లేకుంటే రాయలసీమ ద్రోహిగా, చరిత్ర హీనుడిగా నిలిచిపోవడం ఖాయమని అన్నారు.

కలకలం రేపిన బ్యాగులు



చెట్ల మధ్యలో వదిలేసి వెళ్లిన రెండు బ్యాగులు



బట్టలు వదిలేసిన దృశ్యం

అట్లూరు : మండల పరిధిలోని అయ్యప్పస్వామి దేవాలయం వెనుక భాగాన ఆదివారం సాయంత్రం కనిపించిన బ్యాగులు కలకలం రేపాయి. స్థానికుల కథనం మేరకు కడప–బద్వేలు ప్రధాన రహదారి పక్కనే ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం వెనుకభాగాన కంపచెట్లలో ఆదివారం సాయంత్రం సుమారు పది బ్యాగులు, లుంగీలు, బనియన్లు, డ్రాయర్లు అప్పటికప్పుడు వదిలేసి వెళ్లారు. ఈ విషయం ఆ నోట ఈ నోట పడి పోలీసులు, అటవీ అధికారులకు తెలిసింది. దీంతో అటవీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా తమిళనాడుకు చెందిన బ్యాగులు, కవర్లలో నాటుసారా కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇవి ఎర్రచందనం అక్రమ రవాణా చేసే తమిళ కూలీలకు సంబంధించినవని నిర్ధారణకు వచ్చి వాటిని సిద్దవటం ఫారెస్టు రేంజర్ కళావతి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే లంకమల అభయారణ్యం మద్దూరు బీటు నుంచి కొత్త వ్యక్తులు రోడ్డుపైకి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. అలాగే శనివారం సిద్దవటం అటవీ అధికారులు మద్దూరు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు తమిళ కూలీలు పట్టుబడినట్లు విశ్వసనీయ సమాచారం. శనివారం ఇద్దరు పట్టుబడటంతో వారికి సంబంధించిన వారే అడవి నుంచి బయటకు వచ్చి పారిపోయి ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గంగాధర్



కారు ఢీకొని గాయపడిన గోపి

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కర్ణాటక రాష్ట్రం సోమయాజులపల్లె తాలూకా పెగలపల్లెకు చెందిన గంగాధర్(28) వ్యక్తిగత పనులపై రామసముద్రం వచ్చాడు. అక్కడి నుంచి మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో కాప్పల్లె వద్ద మద్యం మత్తులో మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, తలపై తీవ్ర గాయాలయ్యాయి. పుంగనూరు దండుపాళ్యంకు చెందిన వెంకటరమణ కుమారుడు గోపి(45) ద్విచక్రవాహనంలో వెళుతుండగా, కొత్త ఇండ్లు సమీపంలో కారు ఢీకొనడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

సుండుపల్లె : ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బూడిదెట్టివాండ్లపల్లికి చెందిన సుబ్బలక్షుమ్మ (65) ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ మదనపల్లెలో చికిత్స పొందుతూ ఉండేది. ఈనెల 14వ తేదీ సోమవారం రాత్రి కుటుంబీకులు గంగమ్మతల్లి జాతరకు వెళ్లారు. ఈ నేపథ్యంలో నరాల సంబంధిత వ్యాధి భరించలేక పురుగుల మందు తాగింది. తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎం. శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాము కాటుకు గురై.. మృత్యువాత

రామాపురం : పాము కాటుకు గురైన షేక్ తహరీన్ అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హసనాపురం కస్పాకు చెందిన తహరీన్ గత నెల 27న పాము కాటుకు గురైంది. మెరుగైన చికిత్స కోసం బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి బంధువులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అక్టోబర్ 18న మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యం

వైవీయూ : సేవాభావాన్ని పెంపొందించడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి. ప్రమీల పేర్కొన్నారు. కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో రోవర్స్ అండ్ రేంజర్స్‌కు ఒక్కరోజు వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా సమాజం పట్ల బాధ్యత, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ రమణయ్య మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను గుర్తించిన ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో 0.5 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. రైల్వే, పోస్టల్ శాఖల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ప్రత్యేక రిజర్వేషన్, రిక్రూట్‌మెంట్‌లు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి సేవలు అందించడం ద్వారా కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. అనంతరం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు, సేవలపై అవగాహన కల్పించారు.



తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో మాట్లాడుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు

ఉత్సాహంగా తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు

కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు ఉత్సాహంగా సాగుతోంది. ఈనెల 18న ప్రారంభమైన క్యాంపులో ఆదివారం లీడర్ ఆఫ్ ది కోర్సు రమణయ్య, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి.ప్రమీల, అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకర్ తదితరులు క్యాంపును పర్యవేక్షించారు. క్యాంపులో వివిధ పాఠశాలలకు చెందిన స్కౌట్స్ పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో సోమవారం 'ఇండియన్ ఎయిర్‌ఫోర్సులో ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ తెలిపారు. ఎయిర్ వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో 17 నుంచి 21 ఏళ్ల వయసు గల డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు, యువత పాల్గొనవచ్చని తెలిపారు. అన్నమాచార్య కళాశాలలో ఉదయం, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.